

## ప్రజాపథంలో బస్తీ సమస్యలపై టీడీపీ ఆందోళన

**విశ్వంభర, ఖైరతాబాదు :** ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాదు ఖైరతాబాదు నియోజకవర్గంలోని దేవరకొండ బస్తీలో నిర్వహించిన 'తెలుగుదేశం--ప్రజాపథం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బస్తీలో పాదయాత్ర నిర్వహించిన నాయకులు స్థానికుల నుంచి తాగునీటి కొరత, డ్రైనేజీ, దెబ్బతిన్న రహదారుల సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ, బస్తీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లెల కిశోర్, ప్రవీణ్, బాలరాజ్ గౌడ్, వల్లారపు శ్రీనివాస్, అన్వర్, పి. వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రామన్నపేట విద్యార్థులకు పతకాలు



**విశ్వంభర, రామన్నపేట:** ఈనెల 18 న మెదక్ జిల్లా ఇందిరా ప్రియదర్శిని అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తోటకూరి శివాని బి.ఏ. ప్రథమ సంవత్సరం అండర్ 18 బాలికల 1500 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, జి.సునీల్ బి.ఏ. ద్వితీయ సంవత్సరం పురుషుల 1500 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. శివాని, సునీల్ లు గత కొంత కాలం నుండి భువనగిరిలోని హనుమాన్ ట్రైనింగ్ సెంటర్లో, అథ్లెటిక్స్ కోచ్ కోనేటి గోపాల్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారని తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం.రవీందర్ రావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## 20న రాజధాని ఢిల్లీలో జరిగే బోనాలకు ఆహ్వానం

**విశ్వంభర, లాల్ దర్వాజా:** ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మూడు రోజులపాటు జరిగే శ్రీ సింహ వాహిని మహంకాళి బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్యామల కిరణ్ కుమార్ రెడ్డిని జనరల్ సెక్రటరీ వినోద్ , ట్రెజరర్ చంద్రు కలిసి ఆహ్వానించారు. డిల్లీ లో బోనాలు జూలై 20 నాడు తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహిస్తారు. 21 నాడు ఉదయం తెలంగాణ భవన్ లో ఫోటో ఎక్సిబిషన్ 10 గంటలకు మధ్యాహ్నం నాలుగు గంటలకు ఇండియా గేట్ నుండి



ప్రాసెషన్ బాజా బజంత్రీల మధ్య మొదలు అయి తెలంగాణ భవన్ లో ఉన్న మహంకాళి దేవత దగ్గర ముగుస్తుంది. 22 నాడు లాల్ దర్వాజా అమ్మవారికి బంగారు బోనం సమర్పణ, పోత రాజు స్వాగతం మరియు పట్టువస్త్రాలు సమర్పణ చైర్మన్ శ్రీ మారుతి యాదవ్ ద్వారా సాయంత్రం కల్చరర్ ప్రోగ్రామ్ నిర్వహణ జరుగుతుంది అని తెలిపారు.

## రైతు భరోసాకు మరో అవకాశం

**విశ్వంభర,పెద్దశంకరంపేట:** పెద్ద శంకరంపేట మండలం రైతులకు రైతు భరోసా పథకం కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు . కొత్త దరఖాస్తులు, బ్యాంకు ఖాతా వివరాల మార్పునకు జూలై 31 వరకు గడువు ఇచ్చింది. జూన్ 15 వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన వారు, ఇప్పటివరకు లబ్ధి పొందని వారుఅర్హులు అని ఆయన పేర్కొన్నారు లబ్ధిదారులు ఈ విషయమై ఏఈఓలను సంప్రదించాలని పేర్కొన్నారు.



## మొక్కలు నాట డంతో పాటు సంరక్షించుకోవాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** గ్రామాలలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్కాపూర్ సర్పంచ్ రాజేశ్వరి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ లో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి తదితరులు మొక్కలను నాటారు.. కమలాపూర్ గ్రామంలో సర్పంచ్ కుంట్ల సుజాత రాములు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ ఉపసర్పంచ్ మంజుల పంచాయతీ కార్యదర్శులు స్వప్న గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు విలువలను పెంపొందించాలి: గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా




**విశ్వంభర, నారాయణగూడ :** విద్య అంటే కేవలం జ్ఞానం కాదు.. సద్గుణాలు, క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దే ప్రక్రియని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాదులోని నారాయణగూడలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం 86వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. సంస్థ అధ్యక్షుడు అన్నదానం సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, గురువుల పట్ల గౌరవం పెంపొందించు కోవాలని సూచించారు. కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థలు ఎనిమిది దశాబ్దాలకు పైగా నాణ్యమైన విద్యతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు అండగా నిలవడం సంస్థ సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, వికసిత్ భారత్--2047 లక్ష్యాల సాధనలో ఉన్నత విద్య కీలకమని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా కొత్త కోర్సులు, పాఠ్యాంశాల సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. తెలంగాణను ఉన్నత విద్యలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యా, సేవా రంగాల్లో విశిష్ట కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందిని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో: సి.ఏ. జె. నరసింహారావు, శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నీల్ గోగ్టే, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** విద్యార్థుల శాంతియుత నిరసనలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు అన్నారు. నీట్, సీయూఈటీ తదితర పరీక్షల నిర్వహణలో తలెత్తిన అవకతవకలు, ఎన్‌టీఏ వైఫల్యాలకు నిరసనగా సోమవారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి లో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమైంది. దీక్షను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, ఎన్‌టీఏపై విద్యార్థుల విశ్వాసం దెబ్బతిందని, దానిని రద్దు చేసి పారదర్శక ప్రవేశ పరీక్షల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాలపై పోలీసు నిర్బంధం, ఢిల్లీలో నిరసనకారులపై లాఠీచార్జి, వాటర్ క్యానన్ల ప్రయోగాన్ని ఖండించారు. అరెస్టు చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులను వెంటనే విడుదల చేసి, కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. రజనీకాంత్, ప్రసాద్, స్కైలాబ్ బాబు, కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, జూనుగరి రమేష్, ఎం. మమత, డి. కిరణ్, కె. అశోక్ రెడ్డి, విఘ్నేష్, ప్రశాంత్, అభిషేక్, నాగకృష్ణ, రవీందర్, సందీప్, ప్రవీణ్, అర్జున్, శ్వేత పాల్గొన్నారు.

## మాలపల్లిలో వాతావరణ అనుకూల వ్యవసాయంపై రైతులకు అవగాహన




**విశ్వంభర, హుస్నాబాద్ :** వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు స్థిరమైన, పర్యావరణహిత సాగు పద్ధతులను అవలంబించాలని వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సూచించారు. హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ అనుకూల వ్యవసాయం, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వెన్న రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని, రైతులు ఆధునిక, పర్యావరణహిత సాగు విధానాలను అవలంబించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించి సాగు ఖర్చులను నియంత్రించవచ్చని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికత, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన పెంచి ఆదాయ వృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ పంట అవశేషాల నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి పర్యావరణహిత పద్ధతులను పాటించడం ద్వారా నేల సారం మెరుగుపడి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. అలాగే కార్బన్ క్రెడిట్‌కు సంబంధించిన ప్రాథమిక అవగాహన, అర్హత ప్రమాణాలు, నమోదు విధానం, భవిష్యత్తులో లభించే అవకాశాలపై రైతులకు వివరించారు. ఏ ప్రాజెక్టు లేదా ఒప్పందంలో చేరే ముందు నిబంధనలను పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును వేగంగా, పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు అంకితభావంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె. అనిల్ కుమార్, పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి, డీఆర్‌డీఓ మధుసూదనరాజుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్లతో పాటు జిల్లా కేంద్రంలో ప్రజావాణి నిరంతరం కొనసాగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని అంశాలపై సంబంధిత శాఖలకు పంపించి దరఖాస్తుదారులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో ఈసారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నాణ్యత, భూ పట్టాల సవరణ, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రెవెన్యూ, సంక్షేమం, ఇతర శాఖలకు సంబంధించిన పలు సమస్యలపై వినతులు అందాయి. డోర్నకల్ మండలం టి.బంజర గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయని, తామే సొంతంగా నిర్మాణం పూర్తి చేశామని, అందుకు అయిన ఖర్చును చెల్లించాలని కోరారు. కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన రైతు సాదాబైనామా ఆన్‌లైన్ నమోదు లోపాన్ని సరిచేయాలని విజ్ఞప్తి చేయగా, కేసముద్రం మండలం ధన్నసరి గ్రామానికి చెందిన రైతు ప్రభుత్వ చెరువును కబ్జా చేసే ప్రయత్నాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ వారంలో వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 205 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం రాష్ట్ర ప్రభుత్వం-ఎస్‌బీఐ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు అమలవుతున్న ఎస్‌జీఎస్‌పీ శాలరీ ప్యాకేజ్పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకంలో ఉద్యోగులందరూ నమోదు చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎస్. ఈశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించిన ఏఐవైఎఫ్




**విశ్వంభర, హుస్నాబాద్:** న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన లాఠీచార్జ్, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్‌టీఏలో అవినీతి, పరీక్షల నిర్వహణలో లోపాలపై విద్యార్థులు న్యాయమైన డిమాండ్లతో నిరసన వ్యక్తం చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం పోలీసు బలంతో అణచివేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని విమర్శించారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, నిర్బంధించిన వారిని విడుదల చేయాలని, లాఠీచార్జ్‌కి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, విద్యార్థి సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కి దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం ఆయా సబ్జెక్టులలో నెట్, సెట్, ఎం.ఫిల్, పిహెచ్.డి.లలో ఏదేని ఒక అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. డైరీ సైన్స్, కంప్యూటర్ సైన్స్ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ పోస్టులకు గాను ఈనెల 23వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను ఇవ్వవలసిందని తెలియజేశారు. అదే విధంగా మరుసటి రోజు అనగా 24వ తేదీ శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, కావున అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని సకాలంలో హాజరు కావలసిందని కోరారు.

## మృతుల కుటుంబాలకు పట్టణ కాంగ్రెస్ నివాళి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోదాసు శ్రీనివాస్ మాతృమూర్తి గోదాసు పుష్పమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రిటైర్డ్ ఇరిగేషన్ ఈ.ఈ బొడ్డు సాలయ్య సోదరుడు రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ బొడ్డు రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్-చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, రామన్నపేట మేజర్ గ్రామ పంచాయత్ సర్పంచ్ గరిక సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ జమీరుద్దీన్, జెల్లా వెంకటేశం, గోదాసు పృథ్వీరాజ్, డిసిసి జనరల్ సెక్రెటరీ అబ్రహం కుమార్, రామన్నపేట ఉప సర్పంచ్ మోటే రమేష్, పిట్ట వెంకటరెడ్డి, రామిని రమేష్, గుత్తా నర్సిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రమావత్ సక్రు నాయక్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య 3 వ మహాసభ కొత్తగూడెం జిల్లా పారిశ్రామిక పట్టణం పాల్వంచ లో 18-19 తేదీల్లో నిర్వహించారు. ఈ మహా సభకు తెలంగాణ 300 మంది ప్రతినిధులు హజరైనారు. హయత్ నగర్ కు చెందిన రమావత్ సక్రు నాయక్ తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది నా ఎన్నికకు సహకరించినటువంటి రాష్ట్ర మహాసభ ప్రతినిధులకు రాష్ట్ర అధ్యక్షు కార్యదర్శి రామ్మూర్తి అంజయ్య నాయక్ కి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యకి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుకి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహకి విప్లవ అభివందనాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి సంఘం బాధ్యతలు అప్పజెప్పినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గిరిజనుల సమస్యలపై పోరాటాల నిర్వహిస్తానని అన్నారు.



## జంతర్‌మంతర్ విద్యార్థుల ఉద్యమానికి ప్రజాసంఘాల సంఘీభావం

**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, యువత న్యాయమైన పోరాటాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే జంతర్‌మంతర్ వద్ద డాక్టర్ సోనం వాంగ్చుక్ చేపట్టిన ఉద్యమాన్ని అణచివేయడాన్ని ఖండిస్తూ, విద్యార్థుల సమస్యలపై ప్రధానమంత్రి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్, టీఎఫ్‌టీయూ, విద్యావంతుల వేదిక, పాలమూరు అధ్యయన వేదిక, ప్రజా ఫ్రంట్, ఎంఆర్‌జేసీ, కాంగ్రెస్, ఎస్సీ-ఎస్టీ ఉద్యోగుల సంఘం తదితర ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

